క్లుప్తంగా

యాసిడ్ తాగి స్పిన్నింగ్ మిల్లు కార్మికుడు ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: కుటుంబ సమస్యల వల్ల స్పిన్నింగ్ మిల్లు కార్మికుడు యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో ఆదివారం జరిగింది. నారాకోడూరులోని ఎస్వీఎస్వీ స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడిగా పనిచేసే కె.దుర్గయ్య దంపతుల మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్థాపానికి గురైన దుర్గయ్య యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న బాధితుడిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సేవా దృక్పథం అవసరం



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థీ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం నగర శివారు లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాల, ఇగ్నైటెడ్ మైండ్స్ అసోసియేషన్, యలమంచిలి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నగరంలోని అమరావతిరోడ్డు మల్లికార్జునపేటలోని సమర్థన వికలాంగుల సేవా సంస్థ బాలలకు అల్పాహారం, భోజనం ప్యాకెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులను చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, కె.అరుణకుమారి అభినందించారు.

గొర్రెలు, మేకల పెంపకంతో అదనపు ఆదాయం



గుంటూరు రూరల్: రైతులు వ్యవసాయంతోపాటు గొర్రెలు, మేకల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందవచ్చని వెటర్నరీ వైద్యుడు డాక్టర్ గంగవరపు రామకృష్ణ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఆదివారం వ్యవసాయంతోపాటు అనుబంధ విభాగాల ఆదాయ మార్గాలపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పాడి పశువులు, మేకలు, గొర్రెల పోషణతో అదనపు ఆదాయం పొందొచ్చని చెప్పారు. సేంద్రియ వ్యవసాయంలో కషాయాల తయారీ, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. తక్కువ స్థలంలో అధికంగా పంటలు పండించే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ సీఈఓ సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.

లాలుపురంలో చోరీ

గుంటూరు రూరల్: ఇంటి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు బీరువాలో నగదు, నగలు చోరీ చేసిన ఘటన ఆదివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బి.శ్రీనివాసరావు కథనం ప్రకారం.. లాలుపురం గ్రామానికి చెందిన తన్నీరు చిన్నమస్తాన్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 22న ఉదయం ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లాడు. అనంతరం ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. తాళాలు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్ళి చూశాడు. బీరువా తాళాలు పగలగొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న రూ.70 వేల నగదు, నగలు అపహరణకు గురయ్యాయని బాధితుడు చెప్పాడు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: దాచేపల్లిలో గరికపాటి కోటేశ్వరరావును అత్యంత దారుణంగా హత్య చేసి, తగలబెట్టిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవడంతో పాటు, నిందితుడ్ని ఉరి తీయాలని ఆయన డిమాండ్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దేవాపురం 5వ లైనులో నివసించే బూదాల బాలరాజు (40)తాపీ పనులు చేసి జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో శనివారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



నిమ్మగడ్డవారిపాలెం (ప్రత్తిపాడు): ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డవారిపాలెంలో కొలువుదీరిన అంకమ్మతల్లి, పోతురాజు స్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాలు ఆదివారం జరిగాయి. అర్చకులు దేవతామూర్తులకు విశేష పూజలు చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం గ్రామస్తులు చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, కొండా కృష్ణారెడ్డి, సర్పంచ్ రాంబాబు, నిమ్మగడ్డ జనార్దన్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేత్రపర్వంగా గాయత్రీ మహాయజ్ఞం



ప్రత్తిపాడు: గాయత్రీ మంత్ర జపంతో ఆదివారం ప్రత్తిపాడు మార్మోగింది. వేద మంత్రోచ్చారణల నడుమ 108 కుండలముల గాయత్రీ మహాయజ్ఞం నేత్రపర్వంగా జరిగింది. స్థానిక అక్షయ స్కూల్ ఆవరణలో ఆదివారం గాయత్రి పరివార్ మండల శాఖ ఆధ్వర్యంలో గాయత్రీ మహాయజ్ఞంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్వాహకులు మదమంచి సుధాకర్ నేతృత్వంలో జరిగిన సామూహిక యజ్ఞంలో దంపతులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అఖిల భారత గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు కె.వి.పేరి శాస్త్రి గాయత్రీ మహా యజ్ఞంతోపాటు గర్భిణులకు పుంసవన సంస్కారం, గాయత్రీ మంత్రదీక్షకు గురుదీక్ష, చిన్నారులకు నామకరణ సంస్కారం, అక్షరాభ్యాస సంస్కారం, ఉపనయన సంస్కారం, పెద్దలకు పెళ్లిరోజు సంస్కారం, పుట్టిన రోజు సంస్కారాల్ని చేయించారు. పేరి శాస్త్రి మాట్లాడుతూ లోకకల్యాణం, సుఖశాంతులకు గాయత్రీ మహాయజ్ఞం దోహదం చేస్తుందన్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

పల్లె వీధుల్లోకి సాహిత్యం విస్తరించాలి



సభలో మాట్లాడుతున్న గోలి లక్ష్మయ్య

పాత గుంటూరు: పల్లెవీధుల్లో కవి సమ్మేళనాలు పెట్టి సాహిత్యాన్ని గ్రామవీధుల్లో పరిమళింపజేయాలని బాపట్ల జిల్లా డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం, పట్టాభి కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో కవి మిత్రుల కలయిక-కవి సమ్మేళనం-పుస్తక సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ పుస్తకం మానసిక వికాసానికి అద్భుతమైన ఐకాన్ లాంటిదని తెలిపారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ మంచి పుస్తకాలు మనిషి ఎదుగుదలకు దోహదం చేస్తాయని, నవ్యాంధ్ర రచయితల సంఘం జ్ఞాపికలుగా పుస్తకాలనే అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అరసం పల్నాడు జిల్లా కన్వీనర్ కోసూరి రవికుమార్, యేమినేని వెంకటరమణ, సంఘ జిల్లా అధికార ప్రతినిధి బండికల్లు జమదగ్ని పాల్గొన్నారు. కవి సమ్మేళనాన్ని కాకరపర్తి సుబ్రహ్మణ్యం నిర్వహించారు.

పేదలకు ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటుకు సన్నద్ధం



మందుల గురించి డాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గంలోని పేద కాలనీల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుకు సమాయత్తమవుతున్నట్లు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. 10వ డివిజన్ జున్ను షాహీద్‌నగర్‌లోని వాటర్ ట్యాంకుల ఆవరణలో ఆదివారం వైఎస్సార్ సీపీ తూర్పు మహిళా విభాగం నాయకులు నూరి ఫాతిమా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జున్నుషాహీద్‌నగర్‌లో ఇటీవల డ్రైనేజీ పైపులైన్ లీకవ్వడంతో స్థానికంగా ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడానికి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనారోగ్య సమస్యలుంటే వైద్య శిబిరంలో సేవలు పొందాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మీరావలి, ఆబీద్‌బాషా, యిర్రి ధనలక్ష్మి, ఖాజామొహీద్దీన్ చిష్టీ, అజయ్‌కుమార్, పార్టీ నాయకులు రాచమంటి భాస్కరరావు, చింతా శ్రీనివాసరావు, రాంబాబు, బాల, అచ్చికిరణ్, సలీం పాల్గొన్నారు.

డాక్టర్ నరేష్‌బాబుకు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ నరేష్‌బాబు

గుంటూరు మెడికల్: గుంటూరు మల్లిక స్పయిన్ సెంటర్‌కు చెందిన సీనియర్ స్పయిన్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్స్ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ జె. నరేష్‌బాబుకు గోల్డెన్ జూబ్లీ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. గుంటూరు జింఖానా ఆడిటోరియంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న ఆర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు రోజున డాక్టర్ నరేష్‌బాబుకు అవార్డు దక్కింది. కోవిడ్ అనంతరం స్పయిన్ సమస్యలు పెరిగాయని డాక్టర్ నరేష్‌బాబు పేపర్ ప్రజెంటేషన్ చేసినందుకు ఈ అవార్డు ఆయనకు లభించింది. పరిశోధనలు చేసే వైద్యుల్ని ప్రోత్సహించేందుకు ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ అవార్డును అందిస్తోంది. రాష్ట్ర సదస్సులో అవార్డు అందుకున్న డాక్టర్ నరేష్‌బాబుకు అసోసియేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ నవీన్ ఠక్కర్, స్టేట్ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ వి. ధర్మారావు, ప్రెసిడెంట్ డాక్టర్ వి.వి. నారాయణరావు, గుంటూరుకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్స్ డాక్టర్ సూరత్ అమర్‌నాథ్, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, డాక్టర్ గంటా వరప్రసాద్, డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ సీతారామాంజనేయులు, గుంటూరు ఆర్థోపెడిక్ అసోసియేషన్ నేతలు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ కంచర్ల రామ్‌ప్రసాద్, డాక్టర్ మామిళ్లపల్లి శివకుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు

నెహ్రూనగర్: యువతను జాగృతం చేసి వారిలో సేవా దృక్పథాన్ని పెంపొందించడంలో గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ కృషి అభినందనీయమని గుంటూరు నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు తెలిపారు. గుంటూరులోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ నాలుగో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా మాట్లాడుతూ ఫౌండేషన్ డైరెక్టర్ పాల్ చదువుకుంటూ సామాజిక సేవలో భాగస్వామ్యుల వ్వడాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ పాల్, బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ సెక్రటరీ భగత్‌సింగ్, ధారా సుధాకర్, దాసరి జెన్నిబాబు, కేశవ శివ నాగన్న పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు ఎగ్జిబిషన్లు దోహదం

ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



విద్యార్థుల ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కన్న మాస్టారు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీయడంలో సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం చేస్తాయని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. ఆదివారం పాత గుంటూరులోని కన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా నగరంలోని పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన అందించడంలో కన్న మాస్టారు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన వద్ద విద్యను అభ్యసించిన ఎంతో మంది పూర్వ విద్యార్థులు దేశ, విదేశాలలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లోనూ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ, భౌతిక, రసాయన, మానవ నిర్మాణ శాస్త్రాలతో పాటు, మ్యాథమెటిక్స్, జువాలజీ తదితర అంశాలు, నూతనంగా ప్రవేశపెట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు, అతిపెద్ద విమానాశ్రయం, మేధస్సుకు పదును పెట్టే విధంగా విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలు సందర్శకుల్ని ఆశ్చర్యంలో ముంచెత్తాయి. స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో చిన్నారులు, తెలుగు సంస్కృతి సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా రామాయణ, మహాభారత గాథలతో కూడిన శివపార్వతుల వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరి ఫాతిమా, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణమాచారి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి



కాకుమాను: సకాలంలో సక్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా డీలర్లకు సూచించిన సమయం ప్రకారం నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కార్యాలయ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ర్యాలీ

పెదనందిపాడు: ఎస్సీ వర్గీకరణ చేస్తామని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం తన హామీని విస్మరించిందని మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ సునీల్ మాదిగ విమర్శించారు. ఆదివారం రావిపాడు గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సునీల్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోరుతూ మార్చి 15న రాజధాని ముట్టడి కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. ర్యాలీలో ఎమ్మార్పీఎస్ నాయకులు విక్టర్ పాల్ మాదిగ, నిర్మల మాదిగ, వాణి మాదిగ పాల్గొన్నారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్టు

గుంటూరు ఈస్ట్: దాడి కేసులో ఐదుగురిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేయగా ఆరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం గాజుల రాజు రాజాగారితోట 2వ లైను వద్ద మద్యం మత్తులో ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడ్డాడు. అక్కడ ఉన్న గుర్రం శ్రీనివాసరెడ్డి , కంపా రాంబాబు అది చూసి నవ్వారు. దీంతో గాజుల రాజు అక్కడి నుంచి వెళ్లి మరో ఐదుగురిని తీసుకుని వచ్చి గదిలో నిద్రిస్తున్న శ్రీనివాస రెడ్డి, రాంబాబుపై దాడి చేశారు. వారి వద్ద ఉన్న బంగారు గొలుసు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 7,500తో పాటు స్మార్ట్ వాచ్ లాక్కుని వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితులైన రాజాగారితోటకు చెందిన గాజుల రాజు, సంజీవయ్య నగర్‌కు చెందిన షేక్ ముషీర్ అలీ, చిలకా వారి వీధికి చెందిన షేక్ రసూల్, రాజాగారి తోటకు చెందిన గాజుల గణిరాజు, ఓ మైనర్ బాలుడిని అరెస్టు చేశారు. వారి నుంచి వస్తువులతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో జక్కా అవినాష్ పరారీలో ఉన్నాడు.

వడ్డేశ్వరంలో కార్డన్ సెర్చ్

హాస్టళ్లలో పోలీసుల విస్తృత తనిఖీలు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు డీఎస్పీ రాంబాబు పర్యవేక్షణలో తాడేపల్లి సీఐలు శేషగిరిరావు, సాంబశివరావు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున వడ్డేశ్వరంలోని ప్రైవేటు హాస్టళ్లలో ఆరు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. చాలా హాస్టళ్లలో ఖాళీ మద్యం బాటిళ్లు కనిపించడంతో విద్యార్థులందరికీ తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించడం వల్ల తలెత్తే అనర్థాల గురించి వివరించారు. తనిఖీల్లో ఎస్ఐలు రమేష్, నారాయణ, శ్రీనివాసరావు, 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కొల్లా కోటేశ్వరరావు

పెదనందిపాడు: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అన్నపర్రు గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ కథనం ప్రకారం అన్నపర్రు గ్రామానికి చెందిన కొల్లా కోటేశ్వరరావు(40) కావేరి సీడ్స్‌లో ఫీల్డ్ అసిస్టెంట్. శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో వాకింగ్‌కని డాబాపైకి వెళ్లిన అతను అరగంట తర్వాత కనిపించలేదు. డాబా పక్క సందులో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దగ్గరలో ఉన్న ఆర్‌ఎంపీని పిలిపించి పరీక్ష చేయించగా అప్పటికే మృతి చెందాడు. మృతుని తండ్రి తిరుపతయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన కుమారుడు తరుచూ మానసికంగా ఒత్తిడికి లోనవుతుంటాడని, అందువల్లే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని తిరుపతయ్య పోలీసులకు చెప్పారు.

గర్భాశయ వ్యాధులపై అశ్రద్ధ తగదు

ప్రముఖ గైనకాలజిస్టు బూసిరెడ్డి దీప్తిరెడ్డి



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దీప్తిరెడ్డి

గుంటూరు రూరల్: గర్భాశయ వ్యాధులను మహిళలు అశ్రద్ధ చేయరాదని సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి సూచించారు. ఆదివారం వెంగళాయపాలెం గ్రామంలో ఉన్నతి ఫౌండేషన్, సాయిభాస్కర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ దీప్తిరెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా మహిళలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు గురవుతున్నారని, దానిని వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చని వివరించారు. ఆడపిల్లలు తొమ్మిదో సంవత్సరం నుంచి 26వ సంవత్సరం వరకూ వ్యాక్సిన్ వేయించుకోవటం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. 35 నుంచి 55 ఏళ్ల మధ్య మహిళలు ఏటా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని 250 మంది మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

అష్టలక్ష్మి మందిరం బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అలంకారంలో అష్టలక్ష్మి అమ్మవారు

పాత గుంటూరు: అరండల్‌పేట నాలుగో లైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో గోపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన, కలశ స్థాపన, విశేష పూజలు, నక్షత్ర హారతి, సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అర్చకుడు ప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 27న శ్రీ సిద్ధిబుద్ధి సమేత గణపతి కల్యాణం, 28న ఆదిలక్ష్మి, మార్చి 1న ధాన్యలక్ష్మి, 2న ధైర్యలక్ష్మి, 3న గజలక్ష్మి, 4న సంతానలక్ష్మి, 5న విజయలక్ష్మి, 6న విద్యాలక్ష్మి, 7న శ్రీ ధనలక్ష్మి, 8న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, 9న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి కల్యాణాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొనాలని ఆయన కోరారు.

విభిన్న ప్రతిభావంతుడికి కంప్యూటర్ సామగ్రి బహూకరణ



జగదీష్‌తో ఆర్‌పీ మిత్ర బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీనివాసరావుపేట ఆరో లైనులో స్టార్ ఆన్‌లైన్ సర్వీసెస్ నిర్వహిస్తున్న విద్యావంతుడైన పి.జగదీష్ అనే విభిన్న ప్రతిభావంతుడికి ఆర్‌పీ మిత్ర బృందం ఆదివారం కంప్యూటర్ టేబుల్, ప్రింటర్, కుర్చీలు, స్టూల్స్‌ను అందజేసింది. జగదీష్ స్వశక్తిని నమ్ముకుని స్థానికంగా చిన్న దుకాణంలో స్టార్ ఆన్‌లైన్ సర్వీసు పేరుతో విద్యుత్, టెలిఫోన్ బిల్లులు, మొబైల్, డిష్ రీచార్జ్ తదితర ఆన్‌లైన్ సేవలు అందిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన అభ్యర్థన మేరకు ఆర్‌పీ మిత్ర బృంద సభ్యులు సామగ్రిని కొనుగోలు చేసి అందించారు. కార్యక్రమంలో ఆర్‌పీ మిత్ర బృంద వ్యవస్థాపకులు ఉప్పుటూరి రవికుమార్, మాజేటి వరప్రకాష్, సభ్యులు మిట్టపల్లి ఆదినారాయణ, పి. మధు, తాటిమట్ల వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీనివాస గుప్త, బొలిశెట్టి సురేష్, కారంశెట్టి మురళి, నాగేశ్వరరావు, కె. సుధీర్, టి. కిరణ్, ఎస్.రఘు, పబ్బిశెట్టి రామకృష్ణ, కొప్పురావూరి రామకృష్ణ, ఎస్. అంకమ్మరావు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ సత్యబాబుకు నివాళి



సత్యబాబు చిత్రపటం వద్ద ప్రముఖుల నివాళి

తెనాలి: విద్యా బోధకుడిగా, సామాజిక, ఆధ్యాత్మిక సేవకుడిగా జీవితాన్ని గడిపిన విశ్రాంత ప్రిన్సిపాల్ పాణుకుమాటి సత్యబాబు మానవతకు ప్రతిరూపమని వక్తలు కొనియాడారు. ఆదివారం జరిగిన సంస్మరణ సభకు అధ్యాపక ప్రముఖుడు బలహరనాథమూర్తి అధ్యక్షత వహించారు. హిందూ పత్రిక విశ్రాంత పాత్రికేయుడు ఆర్.సంపత్ మాట్లాడుతూ నాయుడమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా విశిష్ట శాస్త్రవేత్తకు ప్రదానం చేసే అవార్డు బహూకరణ ఉత్సవానికి సత్యబాబుకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.విష్ణుమూర్తి మరణం తర్వాత ఆ ట్రస్ట్‌ను కేంద్ర చర్మపరిశోధన సంస్థ, చెన్నైలో విలీనం చేసేందుకు సత్యబాబు చేసిన కృషిని బలహరినాథమూర్తి, ఆడిటర్ వెంకట్రావు వెల్లడించారు. వైకుంఠపురం దేవస్థానం , దేవీచౌక్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానాల్లో సంకీర్తనలు, కార్యక్రమాల నిర్వహణలో ఆధ్యాత్మిక సేవకుడిగా సత్యబాబు పాత్రను పలువురు గుర్తు చేశారు. బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక కార్యదర్శిగా పాతికేళ్లుగా ఆయన నిస్వార్థ సేవను పలువురు స్మరించుకున్నారు. కామర్స్ బోధనలో పట్టణంలో సత్యబాబుకు మరొకరు సాటిరారని విశ్రాంత ప్రిన్సిపాల్ నాగిరెడ్డి తెలిపారు. మహేంద్ర స్వాగతం పలికిన సభలో విశ్రాంత ప్రిన్సిపాల్ వింతా మోహనరెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు అర్జునరావు, జి.ఆంజనేయశాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, బాలరాజు, పరుచూరి సుబ్బారావు, వెంకటరత్నం, గంగాధరరావు, సుబ్బారావు, భారతి, భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమాన్ని ఉషారాణి, పద్మావతి, గోవిందు పర్యవేక్షించారు.

విజ్ఞాన ప్రదర్శనకు విశేష స్పందన

తెనాలి అర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూలులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మాంటిస్సోరి గాట్ టాలెంట్ ప్రదర్శనకు ఆదివారం విశేష స్పందన లభించింది. ఉదయం తొమ్మిది గంటలకు స్కూలు ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే ప్రారంభించారు. తెనాలి పట్టణ, రూరల్ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలోని నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, అధ్యాపకులు సంజీవ్‌బాబు, వి.సరోజ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న నరేంద్రకుమార్, డాక్టర్ ఉమ

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు గోగినేని హరిప్రసాదరావు స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం ప్రతిభావంతుడైన విద్యార్థికి ఉన్నత చదువుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. హరిప్రసాదరావు కుమారుడు డాక్టర్ గోగినేని లక్ష్మీప్రసాద్, కోడలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, మనుమడు సందీప్‌బాబు కొత్తపేటలోని నివాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఐటీ సీఎస్‌సీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎన్టీఆర్ జిల్లా గురజ గ్రామానికి చెందిన జాస్తి యశ్వంత్‌కు రూ.లక్షను సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు పురస్కారం పేరుతో పేదరికంలో ఉన్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని చెప్పారు. దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు జ్ఞాపకార్థం ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏటా ఉపకార వేతనాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూర్యదేవర వెంకటరమణ, గోగినేని బుల్లిప్రసాద్, తాడిబోయిన శ్రీనివాసరావు, గుమ్మడి రమేష్, నేలటూరి బెన్ను, చెరుకూరి సుబ్బారావు, కొడాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.